గుంతల దారిలో వెళ్లేదెలా?

- అధ్వానంగా వెల్మల్–డీకంపల్లి రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

నందిపేట్(ఆర్మూర్): మండలంలోని వెల్మల్ నుంచి అలూర్ మండలం డీకంపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. అడుగడుగుకు గుంతలు ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ రోడ్డులో ఎక్కువగా మూలమలుపులు ఉండడంతో పాటు గుంతలు ఉండడంతో రెండు గ్రామాలకు వెళ్లే వారితో పాటు అటువైపు పంట పొలాలు ఉన్న రైతులు అనేక అవస్థలు పడాల్సి వస్తోంది. రోడ్డు బాగాలేకపోవడంతో వాహనదారులు ఈ రోడ్డు గుండా ప్రయాణించాలంటేనే జంకుతున్నారు. కొన్ని రోజులుగా వర్షాలు కురవడంతో గుంతలలో నీరు నిలిచి మరింత ప్రమాదకరంగా మారింది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డును బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


వెల్మల్ గ్రామంలో కంకర తేలిన రోడ్డు


వెల్మల్– డీకంపల్లి వెళ్లే దారిలో ఏర్పడ్డ గుంతలు

మరమ్మతులు చేపట్టాలి

రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈ రోడ్డు గుండా ప్రయాణించాలంటే భయంగా ఉంటోంది. వర్షాకాలం మరింత దారుణంగా ఉంటుంది. అధికారులు స్పందించి గుంతల రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి.

– దారం సురేష్, వెల్మల్

నిధులు మంజూరు చేయాలి

వెల్మల్ నుంచి డీకంపల్లి వరకు 3 కిలోమీటర్ల రోడ్డులో ఎన్నో గుంతలు ఉన్నాయి. రోడ్డు వెంట మూలమలుపులు కూడా ఉన్నాయి. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వెంటనే అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలి.

– కోమటి సుదర్శన్, డీకంపల్లి

నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలి

బాల్కొండ: గ్రామాల్లో తాగు నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆర్మూర్ డీఎల్‌పీవో శివకృష్ణ అన్నారు. బుధవారం బాల్కొండ మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటి పన్నుల డిమాండ్ డ్రాఫ్ట్ సిద్ధం చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలన్నారు. ఎంపీడీవో విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఎంపీవో గంగామోహన్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎల్‌పీవో శివకృష్ణ

ముదిరాజ్ కమిటీ ఎన్నిక



డొంకేశ్వర్(ఆర్మూర్): మండల ముదిరాజ్ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా రాజేశ్వర్, ఉపాధ్యక్షుడిగా మద్దుల రాజేందర్, ప్రధాన కార్యదర్శిగా అనిల్, కోశాధికారిగా రాము ఎన్నికయ్యారు. పెద్దగొండ మోహన్, రమేశ్, భోజన్న, కిషన్, రాజేశ్వర్ గంగారాం, సాయికుమార్, గంగాకిషన్‌లు సభ్యులుగా నూతన కార్యవర్గంలో ఉన్నారని అధ్యక్షుడు రాజేశ్వర్ తెలిపారు. ముదిరాజ్‌ల అభివృద్ధి కోసం కృషి చేస్తానని ఆయన అన్నారు.

పంట మార్పిడి విధానంతో బహుళ ప్రయోజనాలు

బోధన్: పంట మార్పిడి విధానంతో బహుళ ప్రయోజనాలు సమకూరుతాయని రుద్రూర్ ప్రాంతీయ చెరుకు, వరి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు ఆకుల దినేష్, శ్రీలతలు పేర్కొన్నారు. వేర్వేరు పంటల సాగు వల్ల అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. ఇందులో భాగంగా పప్పు జాతి, నూనె గింజల పంటలు సాగు చేయాలని రైతులకు సూచించారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎడపల్లి మండలంలోని బ్రాహ్మణపల్లి జీపీ కార్యాలయంలో పంటల సాగు పద్ధతులపై అవగాహన సమావేశం నిర్వహించారు. సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలన్నారు. ఏవో సిద్ధేశ్వర్, ఏఈవో జ్యోతి, గ్రామ రైతులు పాల్గొన్నారు.


బ్రాహ్మణపల్లిలో అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

పశువధశాలతో పంట నష్టం



బోధన్‌టౌన్(బోధన్): పట్టణ శివారులోని 17,18 వార్డుల పరిధిలో ఏర్పాటు చేసిన పశువధశాలతో రైతులు పంట నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం సబ్ కలెక్టర్ వికాస్ మహతో, కమిషనర్ వెంకటనారాయణను కలిసి వినతి పత్రం అందించారు. అనంతరం రైతులు మాట్లాడుతూ.. పశువధశాల వ్యవసాయ పొలాల మధ్యలో ఉందని, పశువులను కోసిన రక్తంతో పాటు వ్యర్థాలు పొలాల్లోకి చేరుతున్నాయని వివరించారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

భూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

వర్ని : రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో రెవెన్యూ అధికారులకు సూచించారు. బుధవారం మోస్రా తహసీల్ కార్యాలయంలో దరఖాస్తులను ఆయన పరిశీలించారు. స్థానిక అధికారులకు పలు సూచనలు చేశారు. తహసీల్దార్ మారుతీ, ఆర్‌ఐ నాగమణి పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్ : భూభారతి చట్టం ద్వారా భూసమస్యలున్న వారికి శాశ్వత పరిష్కారం లభిస్తుందని మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబా గౌడ్ అన్నారు. ఆర్మూర్ రైతువేదికలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ సత్యనారాయణ సమక్షంలో భూ సమస్యలున్న వారి నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ నెల 20 వరకు దరఖాస్తులు తీసుకుంటామని, ఇంకా ఎవరైన ఇవ్వని వారు ఉంటే తహసీల్ కార్యాలయంలో ఇవ్వాలని కోరారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఇట్టం జీవన్, ఆర్‌ఐ దశరత్, సిబ్బంది పాల్గొన్నారు.


దరఖాస్తులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ వికాస్

సాగు విధానంలో మార్పు రావాలి

నందిపేట్(ఆర్మూర్): వ్యవసాయ సాగు విధానంలో మార్పు రావాలని వ్యవసాయ విశ్వవిద్యాలయం సలహా కమిటీ సభ్యుడు కోటపాటి నరసింహ నాయుడు సూచించారు. బుధవారం సిద్దాపూర్‌లో రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తల కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా కీటక శాస్త్రవేత్త సాయిచరణ్ మాట్లాడుతూ.. అవసరం మేరకు యూరియా వినియోగించి పంట సాగు ఖర్చు తగ్గించుకోవాలన్నారు. అలాగే ఫార్మర్ రిజిస్ట్రీలో రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. పీఏసీఎస్ చైర్మన్ కార్తిక్ రెడ్డి, విస్తరణ అధికారులు గంగాధర్, విజయ్, సంధ్య, అబ్దుల్ రైతులు పాల్గొన్నారు.

సాగు ఖర్చును తగ్గించుకోవాలి

బాల్కొండ: రైతులు సాగు ఖర్చులను తగ్గించుకోవాలని కృషి విజ్ఞానకేంద్రం రుద్రూర్ శాస్త్రవేత్త సౌందర్య అన్నారు. బుధవారం మెండోరా మండలం వెల్కటూర్‌లో రైతు ముంగిట శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు యాజమాన్య పద్ధతులను పాటించాలన్నారు. పంటల్లో యూరియా వాడకాన్ని తగ్గించాలన్నారు. భూసార పరీక్షలు చేయించాలన్నారు. ఏవో వసంత్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ సంతోష్, తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

సంక్షిప్తం

మగ్గిడి సబ్‌స్టేషన్‌లో టౌన్ బ్రేకర్ ఏర్పాటు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం మగ్గిడి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో బుధవారం టౌన్ బ్రేకర్‌ను ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌కో ఎస్‌ఈ రవీందర్ ముఖ్య అతిథిగా హాజరై టౌన్ బ్రేకర్‌ను ప్రారంభించారు. అలాగే పిప్రి గ్రామంలో సైతం టౌన్ ఫీడర్ కొత్త విలేజ్ బ్రేకర్‌ను ఎస్‌ఈ ప్రారంభించారు. అనంతరం స్థానికులు సన్మానించారు. డీఈఈ రాజేశ్వర్ రావు, ఏడీఈ శ్రీనివాస్, ఏఈ మౌనిక రెడ్డి, లైన్ ఇన్‌స్పెక్టర్లు బాపు రావు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి దీపంలో 200 మంది కొత్త సభ్యులు

మాక్లూర్ : ఈ ఆర్థిక సంవత్సరంలో మరో 200 మంది కొత్త సభ్యులను చేర్చుకొని రూ.1 కోటి 70 లక్షల రుణాలు ఇవ్వాలని బుధవారం మండల కేంద్రంలోని రఫాత్ ఖాన్ గార్డెన్‌లో ఇంటి దీపం ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు కొండా రాణి అధ్యక్షతన జరిగిన 25వ మహాజన సభ తీర్మానం చేసింది. కార్యక్రమంలో సంఘ మేనేజర్ ప్రభాకర్, నిజామాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎస్ వెంకటేశ్వర రావు, డిచ్‌పల్లి మ్యాక్స్ అధ్యక్షురాలు రాజమణి, పుష్ప బాబు, చంద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

19న మందకృష్ణ మాదిగ సన్మాన సభ

నవీపేట: పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ సన్మానసభను ఈ నెల 19న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు వికలాంగుల హక్కుల పోరాట సమితి(వీహెచ్‌పీఎస్) జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఆమె మాట్లాడారు. వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ఎమ్మార్పీఎస్ ముందుంటుందని ఆమె భరోసా ఇచ్చారు. నాయకులు ఆకారం రమేష్, వీహెచ్‌పీఎస్ నాయకులు భయ్యా సతీష్, పంతులు, సంతోష్, వీరప్ప, వెంకట్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ..

బాల్కొండ: మెండోరా మండలం బుస్సాపూర్‌లో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేశారు. నాయకులు జక్కుల శ్రీనివాస్, నూతుపల్లి శ్రీనివాస్, బోజేందర్. దితరులు పాల్గొన్నారు.

వేల్పూర్: పచ్చలనడ్కుడలో వంగ స్వప్న, నోముల రాకేశ్, భూదేవి, ఎం.లావణ్య, కె.సౌమ్యకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను స్థానిక కాంగ్రెస్ నాయకులు అందజేశారు. నాయకులు గుడాల మోహన్, టక్కర్ గంగాధర్, గట్టుపుతల సర్పారెడ్డి, గొల్లభూమన్న, కృపాల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్ బస్సు రావొద్దని తీర్మానం



కమ్మర్‌పల్లి: నాగాపూర్ గ్రామానికి ప్రైవేట్ స్కూల్ బస్సు రావొద్దని గ్రామస్తులు తీర్మానించుకున్నారు. బుధవారం స్థానిక పాఠశాల యాజమాన్య కమిటీ, గ్రామాభివృద్ధి కమిటీ కలిసి స్థానిక జీపీ కార్యాలయంలో సమావేశమై ఈమేరకు తీర్మాణం చేశారు. గ్రామస్తులు తమ పిల్లలను స్థానిక ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని నిర్ణయం తీసుకున్నారు. వీడీసీ అధ్యక్షుడు బషిరి అశోక్, హెచ్ఎం కిషన్, జీపీ కార్యదర్శి సంధ్య, మహిళా సంఘం అధ్యక్షురాలు బట్టు బాలహంస పాల్గొన్నారు.

అక్రమ మొరం మాఫియాను అరికట్టాలి



నందిపేట్(ఆర్మూర్): నందిపేట గ్రామ సమీపంలో పలుగుట్ట ప్రాంతంలో అక్రమంగా మొరం తరలిస్తున్న మాఫియాను అడ్డుకోవాలని కోరుతూ నందిపేట వీడీసీ ఆధ్వర్యంలో గ్రామస్తులు బుధవారం నందిపేట మండలం నిజామాబాద్ రోడ్డులో రాస్తారోకో చేశారు. రాత్రివేళ రెండు సంవత్సరాల నుంచి అక్రమంగా మొరం తరలిస్తున్నారని ఆరోపించారు. పలుగుట్ట ప్రాంతంలోని ఆధ్యాత్మిక క్షేత్రం నాశనం చేస్తున్నారని, సర్వే నంబరు 629, 630లోని ప్రభుత్వ భూమిని కొందరు అక్రమంగా ఆక్రమించుకున్నారని ఆరోపించారు. జిల్లా అధికారులు విచారణ జరిపి నిర్లక్ష్యంగా వ్యవహరించిన తహసీల్దార్‌ను సస్పెండ్ చేయాలని కోరారు.

జిల్లా స్థాయి రెజ్లింగ్ పోటీలు

మోపాల్: నిజామాబాద్ ఉమ్మడి జిల్లా అండర్–15 జిల్లా స్థాయి బాలబాలికల రెజ్లింగ్ పోటీలు మండలంలోని మంచిప్ప గ్రామంలో నిర్వహించారు. పోటీలో గెలుపొందిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసినట్లు రెజ్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భక్తవత్సలం తెలిపారు. ఈ నెల 14న హైదరాబాద్‌లోని యాకుత్‌పుర అకాడమీలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తారన్నారు. బాలికల విభాగంలో ప్రణతి(33 కేజీలు), రాజేశ్వరి(36కేజీలు), గౌరి(39కేజీలు), మహేక్(42 కేజీలు), సృజన(46కేజీలు) సువేణి(58 కేజీలు), హంసినీ(62 కిలోలు) అలాగే బాలుర విభాగంలో సనిత్(38కేజీలు), అర్జున్(41 కేజీలు), వెంకటేశ్(44కేజీలు), దీక్షిత్(52కేజీలు), సుశాంత్(57కేజీలు), కీర్తన్(62కేజీలు), కేనిత్ 75కేజీల విభాగంలో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు.

క్లుప్తంగా

బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా ముత్యం



డొంకేశ్వర్(ఆర్మూర్): బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా తొండాకూర్ ముత్యం నియమితులయ్యారు. ఈ మేరకు మండల పార్టీ ఇన్‌చార్జి గంగోని చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. తనపై నమ్మకం ఉంచి పదవి ఇచ్చినందుకు నమ్మకంతో పార్టీ కోసం పని చేస్తానన్నారు.

నందిపేట బీజేపీ ఉపాధ్యక్షుడిగా గద్దె రవికుమార్



నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రానికి చెందిన గద్దె రవికుమార్ మండల బీజేపీ పార్టీ ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ అరవింద్, ఎంఎల్‌ఏ రాకేష్ రెడ్డి, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు కులాచారి దినేష్, మండల ఇన్‌చార్జి నూతుల శ్రీనివాస్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

బీజేవైఎం మండలాధ్యక్షుడిగా కొత్తపల్లి గణేష్



కమ్మర్‌పల్లి: భారతీయ యువ మోర్చా కమ్మర్‌పల్లి మండలాధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన కొత్తపల్లి గణేష్ నియమితులయ్యారు. బుధవారం ఈమేరకు బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సతీష్‌రెడ్డి నియామకపు ఉత్తర్వులు అందజేశారు. పార్టీ జిల్లా అగ్రనేతలకు కృతజ్ఞతలు తెలిపాడు.

నియామకం



బోధన్ : తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ లీగల్, హ్యూమన్ రైట్స్ అండ్ ఆర్‌టీఐ విభాగం రాష్ట్ర కన్వీనర్‌గా బోధన్‌కు చెందిన సీనియర్ న్యాయవాది రాజు పటేల్‌ను నూతనంగా నియమిస్తూ బుధవారం ఆ విభాగం రాష్ట్ర చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. కాంగ్రెస్ పార్టీ కేంద్ర, రాష్ట్ర అగ్ర నాయకుల నాయకత్వాన్ని, పార్టీని నిరంతరం బలోపేతం కోసం కృషి చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ విషయాన్ని రాజుపటేల్ వెల్లడించారు.

ఉషూ క్రీడాకారుడికి సన్మానం



నవీపేట: రష్యా రాజధాని మాస్కోలో జరిగిన ఉషూ(మార్షల్ ఆర్ట్స్) క్రీడలో గోల్డ్ మెడల్ సాధించిన మండలంలోని ఫతేనగర్ ఫస్ట్ ప్లాట్‌కు చెందిన క్రీడాకారుడు మొహమ్మద్ ఇమ్రాన్ అలీ ఖాన్‌ను గోల్డెన్ తెలంగాణ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో ఘనంగా సన్మానించారు. ఈ నెల 1 నుంచి 7 వరకు జరిగిన అంతర్జాతీయ క్రీడా పోటీలలో గోల్డ్ మెడల్ సాధించి దేశ గౌరవాన్ని నిలబెట్టినట్లు నిర్వాహకులు ఈ సందర్భంగా కొనియాడారు.

పుస్తకం ఆవిష్కరణ



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని కోర్టులో బుధవారం సామాజిక సేవకుడు, విశిష్ట పుడమి రత్న అవార్డు గ్రహీత తులసికుమార్ పట్వారి రూపొందించిన ఆధ్యాత్మిక–అంతర్యామి పుస్తకాన్ని సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి ఆవిష్కరించారు. ఈసందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి మాట్లాడుతూ.. యువత విద్యార్థుల కోసం రూపొందించిన ఈ పుస్తకాన్ని ప్రతిఒక్కరు వినియోగించుకోవాలన్నారు. తులసి మాట్లాడుతూ.. ఈ పుస్తకాన్ని పట్టణ గ్రంథాలయంలో, ఆర్మూర్ కోర్టులో పొందుపరుస్తామన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య



పెర్కిట్(ఆర్మూర్): ప్రభుత్వ కళాశాలల్లో నిష్ణాతులైన అధ్యాపకులతో నాణ్యమైన విద్యనందిస్తున్నట్లు ఆర్మూర్ పట్టణానికి చెందిన ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు చెప్పారు. బుధవారం పట్టణంతో పాటు పెర్కిట్, గగ్గుపల్లి, ఇస్సాపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ఉచిత హాస్టల్ వసతి సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పది మంది విద్యార్థులను కళాశాలలో చేర్పించారు.

పట్టణ సుందరీకరణే లక్ష్యం

ఆర్మూర్‌టౌన్: వంద రోజుల ప్రణాళికలో భాగంగా ఆర్మూర్ పట్టణాన్ని సుందరీకరణ చేయడమే లక్ష్యంగా పనులు కొనసాగుతున్నాయని మున్సిపల్ కమిషనర్ రాజు అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని 18వ, 33వ వార్డులో చేపడుతున్న పూడికతీత పనులను ఆయన పరిశీలించారు.అలాగే ఘన వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించారు. సానిటరీ ఎస్సై గజానంద్, పర్యావరణ ఇంజినీర్ పూర్ణమౌళి, తదితరులు పాల్గొన్నారు.

నేటి చిత్రం



ప్రమాదకరంగా రోడ్డు అంచున భారీ గుంత

బోధన్: ఎడపల్లి నుంచి నిజామాబాద్ వైపు వెళ్లే ప్రధాన మార్గంలో అలీసాగర్ ఎత్తిపోతల పథకం మూడో పంప్‌హౌజ్ వద్ద రోడ్డు ప్రమాదకరంగా ఉంది. రోడ్డు అంచున భారీ గుంత ఏర్పడింది. ఈ రోడ్డు మీదుగా నిత్యం వందల సంఖ్యలో వాహనాల తిరుగుతుంటాయి. ఏమాత్రం ఆదమరిచినా గుంతలో పడి వాహనదారుల ప్రాణాలు గాలిలో కలిసిపోయే ముప్పు పొంచి ఉంది. తక్షణమే అధికారులు స్పందించి గుంత పూడ్చివేతకు చర్యలు చేపట్టాలి. – ఆర్.సురేష్, ఎడపల్లి

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

ఆర్మూర్ : 90102 44405 | బాల్కొండ : 96666 49049 | బోధన్ : 99636 95349

మెనూ ప్రకారం భోజనం అందజేయాలి


ఆర్మూర్‌లో సమావేశానికి హాజరైన హెచ్‌ఎంలు, ఎండీఎం నిర్వాహకులు


బాల్కొండ: మాట్లాడుతున్న ఎంఈవో రాజేశ్వర్

ఆర్మూర్‌టౌన్/పెర్కిట్(ఆర్మూర్): పాఠశాలలు గురువారం నుంచి ప్రారంభమవుతున్నందున ఎండీఎం ఏజెన్సీల నిర్వాహకులు విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందజేయాలని ఎంఈవో రాజ గంగారాం సూచించారు. పెర్కిట్ తెలుగు మీడియం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం కాంప్లెక్స్ పరిధిలోని హెచ్‌ఎంలు, ఎండీఎం ఏజెన్సీ నిర్వాహకులతో పీఎం పోషణ్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. వంట చేసే సమయంలో పరిశుభ్రంగా ఉండే విధంగా యాప్రాన్లు, టోపీలు ధరించాలన్నారు. హెచ్‌ఎంలు శ్రీనివాస్, లక్ష్మీనర్సయ్య, చేతన కుమారి, రవీందర్, ఇందిర, గంగాధర్, ముక్తారుద్దీన్, రాగి జగదీష్, సదాశివ్, నరేందర్, అనసూయ, విజయ, పద్మ తదితరులు పాల్గొన్నారు.


పోతంగల్‌లో మాట్లాడుతున్న ఎంఈవో శంకర్

బాల్కొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మండలంలోని మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులతో ఎంఈవో రాజేశ్వర్ సమావేశం నిర్వహించారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

రుద్రూర్: విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టాలని ఎంఈవోలు లోల శంకర్, కట్ట శ్రీనివాస్, ఎస్.శ్రీనివాసరావు సూచించారు. రుద్రూర్, కోటగిరి, పొతంగల్ మండల కేంద్రాల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

విద్యుత్ అధికారుల కొత్త ఫోన్ నంబర్లు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ డివిజన్ పరిధిలోని విద్యుత్ శాఖలో విధులు నిర్వహిస్తున్న అధికారుల పాత నెంబర్ల స్థానంలో కొత్త ఫోన్ నెంబర్లు కేటాయించారు. ప్రజలకు ఏమైనా అవసరం ఉంటే ఈ ఫోన్‌నెంబర్‌లకు కాల్ చేయాలని అధికారులు తెలిపారు.

క్యాడర్	పోస్టు	ఫోన్‌నెంబర్			
ఎస్‌ఈ	నిజామాబాద్	8712485161	ఏఈ	ముప్కాల్	8712485332
డీఈ	టెక్నికల్	8712485162	ఏఈ	మెండోరా	8712485325
ఎస్‌ఏవో	సర్కిల్ ఆఫీస్	8712485170	ఏడీఈ	భీమ్‌గల్	8712485273
డీఈ	ఆర్మూర్	8712485212	ఏఈ	భీమ్‌గల్‌టౌన్	8712485259
ఏఈ	టెక్నికల్	8712485213	ఏఈ	భీమ్‌గల్ రూరల్	8712485249
ఏఈ	కమర్షియల్	8712485243	ఏఈ	వేల్పూర్	8712485271
ఏడీఈ	ఆర్మూర్	8712485244	ఏడీఈ	మోర్తాడ్	8712485308
ఏఈ	ఆర్మూర్ టౌన్-1	8712485224	ఏఈ	మోర్తాడ్	8712485294
ఏఈ	ఆర్మూర్‌టౌన్-2	8712485228	ఏఈ	ఏర్గట్ల	8712485307
ఏఈ	దేగాం	8712485242	ఏఈ	కమ్మర్‌పల్లి	8712485286
ఏడీఈ	పెర్కిట్	8712485355	ఏఈ	బషీరాబాద్	8712485278
ఏఈ	పెర్కిట్	8712485352	ఏఏవో	ఈఆర్‌వో ఆర్మూర్	8712485359
ఏఈ	బాల్కొండ	8712485319	ఏఏవో	ఈఆర్‌వో భీమ్‌గల్	8712485360
			ఏఏవో	ఈఆర్‌వో మోర్తాడ్	8712485361

బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించాలి

ఆర్మూర్‌టౌన్: ప్రయివేట్ పాఠశాల బస్సులు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవాలని ఎంవీఐ వివేకానందరెడ్డి సూచించారు. పెర్కిట్‌లో గల ఎంవీఐ కార్యాలయంలో బుధవారం పాఠశాల బస్సుల ఫిట్‌నెస్ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్మూర్ డివిజన్ పరిధిలోని 230 పాఠశాలల బస్సులు ఉన్నాయని, అందులో 130 వాహనాలు ఫిట్‌నెస్ తనిఖీ చేశామన్నారు. జీవో–35 నిబంధనలు ప్రకారం విద్యాసంస్థల బస్సులు ఉండాలన్నారు.


పరిశీలిస్తున్న ఎంవీఐ వివేకానందరెడ్డి